బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - రాజాం: కొద్దిరోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాజాం మున్సిపాలిటీ 17వ వార్డులో అమ్మవారి కాలనీ 2వ లైన్లో బత్తిన నూకరాజుకు చెందిన పెంకుటిల్లు ఇల్లు కూలిపోయింది. ఈ సందర్భంగా బాధితులకు అండగా 17వ వార్డు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు విజయనగరం పార్లమెంటు బీసీ అధికార ప్రతినిధి మరిపి జగన్ మోహన్ ఆద్వర్యంలో గంధి గోపి, మెంటాడ పద్మ, గోరు రజిని, దంగుడుబియ్యపు శ్రీనువాసరావు, వాసిరెడ్డి వెంకటరమణ, యేగేశ్వరరావులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు

విశాలాంధ్ర - జామి: రాష్ట్రంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా అన్ని యూనియన్ల మద్దతుతో ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు కోరారు. ఆదివారం అలమండలో సమ్మెకు సంభందించిన

కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ రేట్లు పెంచడం లేదన్నారు. రైతులకు సంభందించి గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా అన్ని కార్మిక, ఉద్యోగ వర్గాలు ఈసమ్మెలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బందారు వరలక్ష్మి, దెందేటి కుమారి, అచ్యుతాంబ, వర్రి సత్యవతి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పనిచేస్తున్నాం

- జిందాల్ విషయంలో అపోహలు వద్దు
- టీడీపీ మాయాంలోనే తారకరామా అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేయడం జరుగుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలనలో అన్ని రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రగతివైపు పరుగులు పెట్టించేలా కృషి చేస్తోందన్నారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వలన సుగర్ ఇండస్ట్రీ పూర్తిగా దెబ్బతినడం జరిగిందన్నారు. జిందాల్ అంశంలో రైతులు ఆపోహలు వీడాలని సూచించారు. గత పాలనలో జీవో విడుదల చేయడం జరిగిందని, దీనిపై నాడు మాట్లాడకుండా నేడు రాద్దాంతం చేస్తున్నారని దీనిని ప్రజలు గుర్తించాలన్నారు. జిందాల్ భూములలలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు ఏపరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాలేదన్నారు. వస్తే చిత్తూరులోని శ్రీసిటీ మాదిరిగా పరిశ్రమల ఏర్పాటు పిపిపి విధానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వం పరంగా జిందాల్ రైతులకు పూర్తిగా చెల్లింపులు జరిగినట్లుగా అధికారులు చెబుతున్నారన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వస్తే ఆయా పరిశ్రమలకు ఎంత శాతం వాటర్ కావాలో ఏవిదంగా ఇవ్వాలో ప్రభుత్వం ప్రకటిస్తుందని, అంత వరకు రాద్దాంతం చేయవద్దని కోరారు. జిల్లాలో తారకా రామ తీర్ధ సాగర్ ప్రాజెక్టు నాడు టీడీపీ మాయాంలోనే అభివృద్ధి చెందందని, గత వైసీపీ పాలకులు పూర్తిగా వదిలేసారని ఆరోపించారు. తిరిగి ఇప్పుడు 100కోట్లును మంజూరు చేయడం జరిగిందన్నారు. వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అబద్దాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఐదేళ్ళలో ఏం చేశారని ప్రజల్లోకి వెళ్ళి ముఖం చూపిస్తారని ప్రశ్నించారు. ఏడాదిలోనే రాష్ట్రంలో అనేక మార్పులు జరిగాయని, విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషితో విశాఖకు కార్పోరేట్ సంస్థలు వస్తున్నాయని తెలిపారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బిజెపి గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనను స్మరించుకుంటూ ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని దేశ భక్తితో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.తౌడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.బూర్జి వలసలో సుపరిపాలనలో తొలి అడుగు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని ఎన్.బూర్జి వలస గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గ్రామ బూత్ ఇన్‌చార్జ్ బోనంగి తిరుపతిరావు, గ్రామ టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంవత్సర కాలంలో ప్రభుత్వం పరిపాలన, వారికి కావలసిన పథకం వివరాలు ప్రభుత్వంపై వారికి ఉన్న అభిప్రాయం సేకరించారు.

సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి తెలిపే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణం 5వ వార్డులో ఎమ్మెల్యే బేబీ నాయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలపై వివరించారు. అనంతరం పట్టణం 3వ వార్డులో టీడీపీ సభ్యత్వం కలిగిన పిట్టా రమేష్ ఇటీవల అకాల మరణం చెందిన కారణంగా, వారికి పార్టీ తరపున ఐదు లక్షల రూపాయలు చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యులు వెలగాడ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77 శాపంగా మారిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. నాగభూషణం అన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీటికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు త్రైమాసికల ఫీజు బకాయిలు 4200 కోట్ల రూపాయలు హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు 2200 కోట్ల రూపాయలు మొత్తం 6400 కోట్లు రూపాయలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడుదల చేస్తానని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని ఇంతవరకు వాటి గురించి మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు. ఊరు ఊరు తిరిగి మంత్రి నారా లోకేష్ జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని చెప్పారని గత ప్రభుత్వం ఈ జీవోను తీసుకురావడం వలన అనేక మంది పేద వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య తీరని కలగానే మారిపోయిందని గుర్తు చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చినట్టు, ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వి.గౌరీ శంకర్, పట్టణ నాయకులు నవీన్, సాయి, రాము, రామకృష్ణ, ప్రవీణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాపాయం నుండి రక్షణ

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి రక్షణ పొంది, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాలలో కేవలం హెల్మెట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారన్నారు. వాహనాలు నడిపినపుడు ప్రతీ వాహనదారుడు విధిగా నాణ్యత కలిగిన హెల్మెట్ ధరిస్తే, ప్రమాదానికి గురైనప్పటికీ స్వల్ప గాయాలతో ప్రాణాలను రక్షించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు తప్పనిసరిగా రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై ఎం.వి.నిబంధనలు అతిక్రమించినట్లుగా పరిగణించి ఈ-చలానాలను విధించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అతివేగం ప్రమాదక రమని, వేగంకన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యమని అన్నారు.

బొత్స మాటలు హాస్యాస్పదం

డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - చీపురుపల్లి: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికలు హామీలు అమలు చేయడం లేదని బొత్స అనడం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ నాయకులు గ్రామాల్లోకి వెళ్తే.. అక్కడి ప్రజలే నిజాలేమిటో చెబుతారని సూచించారు. తల్లికి వందనం పథకం

ద్వారా విద్యార్థుల తల్లులందరి బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమయ్యాయని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ వస్తున్నాయన్నారు. దీపం 2 పథకం ద్వారా ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయని, వాటికి సంబంధించిన డబ్బులు మహిళల ఖాతాలోనే నేరుగా జమ చేస్తున్నట్లు చెబుతారని తెలిపారు. వైసీపీ వారు చేసిందేమీ లేక, ఏదో నెపంతో మళ్లీ ప్రజల వద్దకు వెళ్లి మోసగించాలని చూస్తున్నారని విమర్శించారు.

నేడు పోస్టల్ కార్యకలాపాలు నిలిపివేత

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలో సోమవారం పోస్టల్ కార్యకలాపాలు సోమవారం ఐటి 2.0 రోల్అవుట్ కారణంగా అన్ని పోస్టల్ కార్యాలయాల్లో కార్యకలాపాలు ఉండవని పోస్టల్ సూపరిండెంట్ కే శ్రీనివాస్ తెలిపారు. తిరిగి మంగళవారం నుండి పోస్టల్ కొత్త సాఫ్ట్వేర్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో సుపరిపాలనలో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రామానికి చెందిన మిత్తి రెడ్డి రమణకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆసుపత్రి నిర్వహణకు 1,19,850 రూపాయలు చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మిత్తిరెడ్డి వెంకటరమణ, లోగిస రాము నాయుడు పాల్గొన్నారు.

బదిరులకు, అనాదాలకు భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర - కొత్తవలస : తొలి ఏకాదశి సందర్భంగా సుబ్బలక్ష్మి ఛార్టీబుల్ ట్రస్ట్ ఆధ్వర్యములో కొత్తవలస మండల కేంద్రంలోని చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాలలో 40 మంది మానసిక దివ్యాంగులకు, అలాగే బలిగట్టం వద్ద నున్న న్యూ హెూప్ అనాధ వృద్దులకు, పిల్లలకు 35 మందికి భోజనం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కనకాల శివ తెలిపారు. ఈ కార్యక్రమానికి బెంగుళూరు వాస్తవ్యులు డీ.విజయలక్ష్మి ఆర్థిక సహకారంతో నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలంలోని డెంకాడ గుణుపూర్ ఉభయ గ్రామాల శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు గ్రామ భక్తుల సమక్షంలో స్వామివారికి 108 కళశాల పాలు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ

సందర్భంగా భక్తులతో కలసి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి 108 కలశాలతో (పాలు) ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు ప్రసాదించారు.

వ్యక్తి అదృశ్యం

విశాలాంధ్ర - రామభద్రపురం: మండలంలోని కోటసిర్లం గ్రామానికి చెందిన బప్పడాల ప్రభాకరు అదృశ్యం అయ్యాడని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన తెలిపిన ప్రకారం గత నెల 25వ తేదీన బుధవారం పాఠశాల గ్రామం ఇంటి వద్ద నుంచి అదృశ్యం అయ్యాడని అన్నారు. ఈయనకి కొంచెం మతిస్థిమితం లేదని అన్నారు. ఈయన వయస్సు 34 సం ఈయనకు భార్య కుమారి ఇద్దరు కుమారులు ఉన్నారని అన్నారు. భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

వృద్ధులకు అండగా నిలవండి

విశాలాంధ్ర - కొత్తవలస: వృద్ధాప్యంలో వృద్ధులకు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని మండలంలోని తుమికాపల్లి గ్రామం వద్ద నున్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ పిలువునిచ్చారు. ఆదివారం ట్రస్ట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ హరికుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు తులసీరాం, భావన దంపతుల తనయుడు వేయాన్ష్ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసరాలను పంపిణీ చేసామన్నారు. ఉపాధ్యాయురాలు కామేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, అమ్మ క్యాటరింగ్ సందీప్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహాయంతో ముఖ్య అతిథి కోరుబిల్లి గణపతి చేతుల మీదుగా నిత్యవసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, ప్రకాష్, త్రివేణు తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో సుపరిపాలనలో తొలి అడుగు

విశాలాంధ్ర - భోగాపురం: సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా మండలంలో నందిగాం గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆదివారం పర్యటించారు. ఈ ప్రజా చైతన్య కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ లక్ష్యాలను, ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సమర్థవంతమైన పాలన విధానాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని బంగార్రాజు కొనియాడారు. రానున్న కాలంలో ఆంధ్ర రాష్ట్రం రంగాల్లో నచ్చింది వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, యూనిట్ ఇంచార్జి గరే సూర్యతేజ మాస్టర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదంలో మరణించిన జెఎల్ఎంకు ఆర్థికసాయం



విశాలాంధ్ర - జామి: కొద్ది రోజులక్రితం వెంకటరాజుపాలెం సచివాలయం జూనియర్ లైన్‌మేన్‌గా పనిచేస్తున్న షేక్ రహిమాన్ విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ ఫోల్‌పై పనిచేస్తుండగా ప్రమాద వశాత్తు షాక్‌కు గురై మరణించిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబానికి ఎపి ఎలక్ట్రసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 తరుపున ఆదివారం రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేసారు. మృతుని తల్లిదండ్రులకు ఈమొత్తాన్ని ఆయన స్వగ్రామం లొట్లపల్లిలో యూనియన్ నేతలు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ కార్యదర్శి ఎస్.లక్ష్మణ, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగు నాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.పైడిరాజు, విజయనగరం రూరల్ బ్రాంచ్ కార్యదర్శి జి.దేముడు, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, ఆఫీస్ కార్యదర్శి ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో గల బహుళార్ధ పశు వైద్యశాలలో జూనోటిక్ వ్యాధుల మీద అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంయుక్త సంచాలకులు డా. వై.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటిసారిగా రేబిస్ వ్యాధి నిరోధక టీకా కనిపెట్టిన లూయి పాశ్చర్‌ని స్మరించు కుంటూ, సుమారు 70 శాతంకి పైగా వ్యాధులు జంతువులు నుండి



మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమిస్తాయన్నారు. అని వీటి పట్ల జంతు ప్రేమికులు, యజమానులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్. గంటి మహాలక్ష్మి, సహాయ సంచాలకులు డా.సన్యాసినాయుడు, డా. కె.వి.రమణ, డా.కిషోర్, డా.ధర్మారావు, వైద్యులు డా. మోహన్, డా. హిమజ, డా. వెంకటేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వెంకట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజ నిర్మాణమే సీఎం లక్ష్యం

ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర - వేపాడ: రాష్ట్రంలో పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం అని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి ఆధ్వర్యంలో సువరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పనిచేస్తున్నారని అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జనపురెడ్డి సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌చార్జ్ గోకేడ నాగభూషన్, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, కోన సత్యం, నిరిజోగి దాలి నాయుడు, బంగారు నాయుడు, కోటాన అప్పలనాయుడు, గోకేడ అచ్చం నాయుడు, బూత్ ఇన్‌చార్జ్ ఎర్నాయుడు, ముమ్మన అప్పలనాయుడు, మల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే అభివృద్ధి చేసి చూపించాం: మంత్రి శ్రీనివాస్

విశాలాంధ్ర - జామి: రాష్ట్రంలో గత పాలనలో అనేక విధ్వంసకరమైన పాలన సాగిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాధించిన ప్రగతిని వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. అందరూ సంతోషంగా పథకాలు అందుతున్నాయని మంత్రికి తెలిపారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామి నాయుడు, ఎన్నింటి అప్పలరాజు, ముకుందశ్రీను, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, మండల సీనియర్ నేతలు కొత్తలి సూర్యారావు, జి. ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ధర్నాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి
నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

1వ పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్‌తో విశాలాంధ్ర ప్రత్యేక ఇంటర్వ్యూ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: **మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, ధర్నాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి అని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఒకటో పట్టణ సీఐఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.**

ప్రశ్న: **ప్రస్తుతం యువతకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై ఏ విధమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

సీఐ: ఇప్పటికే ఒకటో పట్టణ పరిధిలో గల అన్ని కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెప్పడం జరిగింది. చెడు వ్యసనాలకు యువత అలవాటు పడి తమ లక్ష్యాన్ని దూరం చేసుకుంటున్నారని దానివల్ల రానున్న కాలంలో అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయాలు యువతకు తెలుపుతున్నామన్నారు.

ప్రశ్న: **ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తే ఎటువంటి అనుమతులు తీసుకోవాలి?**

సీఐ: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ధర్నాలు, ర్యాలీలు సమావేశాల నిర్వహణకు ముందస్తుగా పోలీసు వారి అనుమతి తీసుకోవాలి. దీనికి సంబంధించి ముందుగా డి.ఎస్.పి కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలి. చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ప్రశ్న: **మహిళలపై జరిగే దాడులపై ఏ విధమైన అవగాహన కల్పిస్తున్నారు ?**

సీఐ: మహిళలపై జరిగే దాడిలో విషయంలో ఇప్పటికే బస్టాండ్, రైల్వే స్టేషన్, కళాశాల, పాఠశాలల వద్ద శక్తి టీం వెళ్లి మహిళలకు శక్తి మొబైల్ యాప్‌లో ఉండే ఎస్ఓఎస్ షేప్ ట్రావెల్ ఆప్షన్‌పై అవగాహన కల్పిస్తుంది. ప్రతిరోజు దీనిపై ప్రత్యేక కార్యాచరణ ఉంది. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించేలా ఉండాలి.

ప్రశ్న: **రాత్రిపూట నేరాలు అరికట్టేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు ?**

సీఐ: రాత్రిపూట నేరాలు అరికట్టేందుకు ఇటీవల రాత్రి గస్తీ సమయాన్ని పెంచాం. ప్రతిరోజు ఇద్దరు ఎస్ఐ స్థాయి అధికారులు రాత్రంతా ఒకటవ పట్టణ పరిధిలో అన్ని ప్రాంతాలలో తిరుగుతూ ఉంటారు. అంతేకాకుండా ప్రత్యేక క్రైమ్ టీం కూడా అందుబాటులో ఉంది. ఇప్పటికే రాత్రి 11 దాటి ఏ కారణం లేకుండా బయటికి వచ్చిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపాం. అంతేకాకుండా రైల్వే స్టేషన్, ఆర్టిసి కాంప్లెక్స్, రద్దీగా ఉండే ప్రాంతాలలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకించి సీసీ కెమెరాలు పర్యవేక్షణలో నిఘా ఏర్పాటు చేసాం.

ప్రశ్న: **మత్తు పదార్థాలపై సమాచారం తెలిస్తే ఎవరికి ఇవ్వాలి ?**

సీఐ: మత్తు పదార్థాల విక్రయం రవాణా వినియోగించే వారి సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే డైల్ 100 లేదా 1972కు తెలపాలి. లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ కైనా తెలుపవచ్చు.

ప్రశ్న: **మత్తు పదార్థాలపై ఎటువంటి శిక్షలు అమలయ్యే అవకాశం ఉంది ?**

సీఐ: మత్తు పదార్థాల అక్రమ రవాణా కేసుల్లో ఎవరైనా చిక్కుకొని అరెస్టు అయినట్లయితే ఇక వారి భవిష్యత్తు నాశనం అవుతుంది. నేరం రుజువైతే 10 సంవత్సరములు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ముఖ్యంగా యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా చూసుకొని వారి భవిష్యత్తు నాశనం కాకుండా చూసుకోవాలి.

ప్రశ్న: **ప్రస్తుత యువతకు మీరు ఇచ్చే సందేశమేంటి?**

సీఐ: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశనుండే అత్యుత్తమ విద్యను అభ్యసించి వారి తల్లిదండ్రుల కలల కన్నా ఆశయాన్ని నెరవేర్చి ఉన్నత ఫలితాలు సాధించేందుకు ప్రయత్నం చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలపై ఆసక్తి చూపకుండా ఉండాలి. ఎన్నో ఇబ్బందులు పడి చదివిస్తున్న తల్లిదండ్రులకు విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నాను.

'సుపరిపాలనలో తొలి అడుగు'లో పాల్గొన్న సురేష్ సమ్మెన

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరం పట్టణంలోని చిన్న పల్లి వీధిలో సుపరిపాలనలో తొలి ఏడాది సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇంచార్జ్ సమ్మెను సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ..సుపరిపాలనలో భాగంగా ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పట్నాల వెంకటేష్, గండు శ్రీను, గండు హరి, రామాంజ, జిల్లా శ్రీను, మండల ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

ఈపీడీసీఎల్, ఆర్ఇసిఎస్‌కి కరెంట్ బిల్లులు కలెక్షన్ చేసే బాధ్యత ఉందా... లేదా?

- డిజిటల్ పేమెంట్లు చేసుకోండి అని సెలవిస్తున్న విద్యుత్ సిబ్బంది
- లబో దిబో మంటున్న నిరక్షరాస్య సామాన్య రైతాంగం
-ఇదేనా ప్రజా సేవ అని ప్రశ్నిస్తున్న సామాన్యుడు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో విద్యుత్ బిల్లు చెల్లించాలంటే నరకయాతన పడాల్సిన దుస్థితి. గతంలో విద్యుత్ బిల్లులు కలెక్షన్‌కి బిల్లు కలెక్టరు వచ్చేవారు. ప్రతి గ్రామం వెళ్లి రామ మందిరం, రచ్చబండల దగ్గర కూర్చొని విద్యుత్ బిల్లులు వసూలు చేసేవారు. పత్రికాలకే పరిమితంతప్ప ఆచరణ సాధ్యం కావడంలేదు మెరకముడిదాం మండలంలో ఒక బిల్ కలెక్టర్ ఉండేవారు ఆయన్ని చీపురుపల్లి బిల్ కలెక్టర్‌గా ట్రాన్సఫర్ చేయడం వలన వినియోగదార్లు లబోదిబోమని అంటున్నారు. ఆ బిల్ కలెక్టర్ బదులు వేరే ఒకరు నియమించు ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదు. మెరకముడిదాం మండలంలో బిల్ కలెక్టర్ లేకపోవడంతో మండలంలో చాలా గ్రామాల ప్రజలు చీపురుపల్లి వెళ్లి కట్టుకోవలసిన పరిస్థితి. పోనీ చీపురుపల్లి వెళ్తే అక్కడ క్యూ లైన్ బారులు తీరి ఉండడంతో ఆరోజు కట్టడం అవ్వకపోతే మరుచటి రోజు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో బిల్లు మాట దేవుడెరుగు రెండు రోజులు కూలి పోయినట్లే. బిల్లు డబ్బులు కన్నా కూలి డబ్బులు ఎక్కువ పోవడంతో సామాన్య ప్రజానీకం లబోదిబో మంటున్నారు. ప్రజలను నానా ఇబ్బందులు పెడుతూ ఈ విధంగా కరెంట్ బిల్లులు వసూలు చేస్తుండడం దారుణమని చాలామంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరే ప్రతి గ్రామం వెళ్లి బిల్లులు కట్టించు కోవలసినదిగా ప్రజానీకం కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని బిల్లు కట్టేవారు అడిగితే డిజిటల్ పేమెంట్ చేసుకోండి అని సెలవిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వాడకమే తెలియని నిరక్షరాస్య రైతాంగం డిజిటల్ పేమెంట్ ఏవిధంగా చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈపీడీసీఎల్ ఆర్ఇసిఎస్ గాని తమ గోడు విని కరెంట్ బిల్లులు కలెక్షన్ కు బిల్లు కలెక్టరులను నియమించాల్సిందిగా కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై అధిక పని భారం మోపే బోధనేతర పనులు తగ్గించాలి : ఎపిటిఎఫ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉపాధ్యాయులపై అధిక పనిభారం మోపే బోధ నేతర పనులు తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ బుఖారి బాబు అన్నారు ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై అధిక పనిభారం మోపే విధంగా ఉండే బోధనేతర పనులు తగ్గించే విధంగా ఉండాలని విద్యాశాఖ అధికారులను కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ మాట్లాడుతూవిద్యారంగంలో అంతకంతకు బోధ నేతర పని భారం పెంచుతూ జూలై 10న జరుగు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కొరకు లీప్ యాప్‌లో విట్నెస్ రిజిస్ట్రేషన్ అన్ని స్కూల్స్ లో జరగాలని అధికారులు ఆదేశాలు ఇచ్చి ఉన్నారనీ, ఈ విట్నెస్‌గా పెట్టుకున్న వ్యక్తి పిటీఎం జరుగు రోజున 30 సెకండ్ల వీడియో మరియు 4 ఫోటోల ను అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది అనిఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.విద్యార్థులు యూని ఫారంలు, బెల్టులు, షూస్, బుక్స్ లాంటివి మాత్రమే కాకుండా మధ్యాహ్నం భోజనం పథకం ఇచ్చే రైసు మొదలగు వాటిపై ప్రత్యేకంగా కోడ్ నెంబర్ ఇచ్చి యాప్స్ లలో అప్లోడ్ చేయాలని, ఒత్తిడి కి గురి చేయడమే కాకుండా ఈ రకమైన కొత్త కొత్త నిర్ణయాలు ఉపాధ్యాయులపై నమ్మకం లేని విధంగా అవమానించే విధంగాను పనిభారం పెంచే విధంగాను ఉంటున్నాయన్నారు. ఈ యాప్ల భారం తగ్గిస్తామని ఒక ప్రక్క చెబుతూనే ఒక్క బాత్రూం ఫోటోలు మినహా ఇప్పుడు ఉన్న ఒకే ఒక యాప్ లీప్ లోనే అనేక పనులకి సంబంధించి ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఉపాధ్యాయులపై ప్రతిక్షణం పనిభారం ఉండేవిధంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎపిటిఎఫ్ అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూచివరికి ప్రభుత్వానికి ఆర్థిక భారం లేని విషయాలలో కూడా అంటే ఆప్షన్ హాలిడేస్ వంటి వాటిని ఇవ్వడం లో కూడా కనీసం ఉపాధ్యాయులు కోరుకున్న విధంగా కాకుండా ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చే విధంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ సెల్ మెంబర్ జే సి రాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పైఈ రకమైన ధోరణి ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య దూరాన్ని పెంచే విధంగా నిర్ణయాలు ఉంటున్నాయని అత్యధిక మంది ఉపాధ్యాయులలో ఈ భావన ఉన్నది కావున ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయాలు చేసేటప్పుడు అధికారులతో మాత్రమే చర్చించి నిర్ణయాలు చేయకుండా ఉపాధ్యాయ సంఘ నేతలతో ఎప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దలే నేరుగా చర్చలు చేసి నిర్ణయాలు చేస్తే సానుకూలంగా ఉంటాయని అన్నారు. ఏపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు మాట్లాడుతూ ఇవే రకమైన నిర్ణయాలు రాష్ట్ర విద్యాశాఖ నుండి వచ్చుచున్న ఎడల రాష్ట్ర సంఘం ఉపాధ్యాయలను ఉద్యమాలకు పిలుపునివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు, అన్ని మండల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి పాఠశాలల్లో బోధనేతర పనులు రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో కాపాడుకోవాలని పాఠశాలల్లో బోధ నేతర పనులు రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ రావు డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ లో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది .ఈ సమావేశం ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నాణ్యమైన విద్యపై కాకుండా యోగాదే, మెగా పేరెంట్స్ సమావేశాలు విజయవంతం కోసం ఆదేశాలు జారీ చేస్తున్నారని ఉపాధ్యాయులను పాఠశాల సమయం అంతా బోధనకు కేటాయించేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులను పాఠశాలలకు నిర్దిష్టంగా కేటాయించకుండా క్లస్టర్ స్కూల్స్‌కి కేటాయించి ఏ ఉపాధ్యాయుడు కూడా ఒకచోట పని చేయించకుండా తిప్పుతున్నారని ఈ విధానం మూలంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదని, మోడల్ ప్రైమరీ స్కూల్లో కాకుండా ఫౌండేషన్ స్కూల్లో, బేసిక్ ప్రైమరీ స్కూల్లో ఎక్కువ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని వీటిని కాపాడుకునేందుకు బాధ్యత సమాజం మొత్తంపై ఉందన్నారు. ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీఆర్ కే ఈశ్వరరావు మాట్లాడుతూ ఐటీఐలు బదిలీ అయిన ఉపాధ్యాయులు 1500 మందికి పొజిషన్ ఐడీలు లేక క్యాడర్ స్ట్రెంత్ లేక జీతాలు నోచుకోని పరిస్థితుల్లో ఉన్నారని ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ, రైతాంగ, కార్మిక సంఘాలు జూలై 9న చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, కార్మిక సంఘాలతో ర్యాలీలు, సదస్సులలో పాల్గొంటుందని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పిఆర్సి, ఐఆర్, డిఏ బకాయిలు పెన్షనర్స్ కు రావలసిన గ్రాట్యుటీ బకాయిలు విడుదల కోసం జేసీసీలో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలలో యుటిఎఫ్ గా పాల్గొంటుందని, ఐక్య ఉద్యమాలకు ముందే ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు విడుదలచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కే విజయ్, యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జేఆర్సి పట్నాయక్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ కుప్పూరి, రాష్ట్ర ఆకాడమిక్ కమిటీ సభ్యులు డి రాము, రాష్ట్ర కౌన్సిలర్ వి సత్య శ్రీనివాస్ ,జిల్లా గౌరవాధ్యక్షుడు అప్పలనాయుడు, జిల్లా సహాధ్యక్షులు వి ప్రసన్నకుమార్, పార్వతి జిల్లా కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ

విశాలాంధ్ర-బొబ్బిలి : స్వరరాగ సంగీతాలయ పేరు మీద దేశ విదేశాలలోనూ మరియు ప్రముఖ పట్టణాలలోనూ నివసిస్తున్న సుమారు 35 మంది విద్యార్థిని విద్యార్థులకు కర్ణాటక సంగీతంలో ప్రవేశ పరీక్షను ప్రభుత్వ ఆధ్వర్యంలో 2024 సంవత్సరంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు జ్ఞాపికలను ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె వి రంగారావు (బేబి నాయన)చేతుల మీదుగా అందజేశారు. ప్రథమ స్నాతకోత్సవాన్ని శ్రీ కళాభారతి ఆడిటోరియం సంగీతాలయ నిర్వాహకులు వంగపండు సునీత మాటూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.విశాఖపట్నం విజయనగరం పట్టణాల నుండి స్థానిక విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సభలో పాల్గొన్న అతిథులు దేవుపల్లి సన్యాసిరావు ముఖ్య అతిథులు కళాభారతి అధ్యక్షులు సిద్ధ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు , ఉపాధ్యక్షులు చెలికాని చెల్లారావు, ప్రముఖ నాయకులు రౌతు రామ్మూర్తి గారు చిన్న వయసు నుండి కర్ణాటక సంగీతం నేర్చుకోవడం అందులో ప్రతిభ సాధించడం ప్రశంసనీయమని అందుకు సహకరించిన ఉపాధ్యాయులు కృషిని అభినందించారు. ఎమ్మెల్యే బేబీ నాయన ప్రతిభ పత్రాలు జ్ఞాపికలు అందజేసి సంగీతానికి సాహిత్యానికి సేవ చేయడానికి శ్రీ కళాభారతి మరియు తాను స్వయంగాను సహకారం అందిస్తానని అన్నారు.

మానవత్వం చాటుకున్న శిష్టకర్ణ లిఫ్టింగ్ హాండ్స్

విశాలాంధ్ర-రాజాం : రాజాం తెలగా వీధిలో నివసిస్తున్న ఉరిటి అనిల్ కుమార్ కు గత నెల 26 వ తేదీ న గుండె సంబంధించిన ఆపరేషన్ జరిగింది. ఆంధ్ర తెలంగాణలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిష్టకరణ లిఫ్టింగ్ హాండ్స్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్స్ సంజుక్త పట్నాయక్, త్యాడ ప్రసాద్ ఆధ్వర్యం తో గ్రూప్ సభ్యుల ద్వారా సేకరించిన రూపాయలు 51,000/- తేదీ 06-07-2025 న అడ్మిన్ త్యాడ ప్రసాద్, సభ్యులు వాండ్రంగి తిరుమలరావు, బగ్గామ్ జోగారావు, రాజాం స్థానికులు ఉరిటి రామలింగేశ్వరావు, అనంతపట్నాయకుని శ్రీనివాస్, శంకర్ సమక్షంలో ఉరిటి అనిల్ కుమార్ మందుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. శిష్టకరణ లిఫ్టింగ్ హాండ్స్ గ్రూప్ ద్వారా ఎంతోమంది కి సహాయం చేస్తున్నట్లు అడ్మిన్ త్యాడ ప్రసాద్ తెలియజేస్తూ ఇంతక ముందు 16 మందికి వారిలో కొందరికి స్వయం ఉపాధి చేసుకొనే విధంగా కుట్టు మిషన్స్, కిరాణాషాపు లకు గ్రూప్ సభ్యుల సహకారం తో ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ గ్రూప్ ద్వారా ముందు ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని అడ్మిన్స్ సంజుక్తపట్నాయక్ మరియు త్యాడ ప్రసాదరావు లు తెలిపారు.

పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్

పశు వైద్యాధికారిణి కే.గాయత్రి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలో గల పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారిణి కోరాడ గాయత్రి అన్నారు.ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం (ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం) సందర్భంగా వేపాడ పశువైద్య చికిత్సాలయం నందు పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో గల గ్రామ పంచాయితీలలో ఇంటి వద్ద పెంపుడు కుక్కలను పెంచుతున్న యజమానులు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని అన్నారు.అలాగే పెంపుడు కుక్క యజమానులకు కుక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-చీపురుపల్లి : విశ్వబ్రాహ్మణ సంఘం బలోపేతానికి తన వంతు కృషి జరుపుతానని ప్రతి ఒక్కరూ సహకరించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లంపల్లి ఆచారి అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో గల విశ్వబ్రాహ్మణ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సంఘ ఎన్నికల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కులంలో పేదవారు ఎవరైనా ఉన్నారో వారికి తన సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ స్థిరపడిన వారు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా కార్పొరేట్ సంస్థల నుంచి వచ్చిన విశ్వబ్రాహ్మణ వృత్తి కార్మికులు మెరుగైన జీవనోపాధి కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. విశ్వబ్రాహ్మణ కులం లో పేదవారైనా కుటుంబాల కోసం ఆర్థికంగా స్థిరపడిన మిగిలిన కుటుంబాలు చేయూత నందించాలని ఈ సందర్భంగా నందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు అనంతరం నూతనంగా ఏర్పాటు అయిన సంఘ కమిటీతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు విశ్వబ్రాహ్మణ మండల సంఘ అధ్యక్షులుగా మారోజు చక్రధర్ ఉపాధ్యక్షుడిగా సర్వసిద్ధి భాస్కరరావు ,కార్యదర్శిగా పట్నాల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బంగారు గోపి ,కోశాధికారిగా ఆను పోజు రామ గౌరవ సలహాదారిగా జోనమతి ఆచారి తో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల సంఘ నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటండి

పట్టణ సీఐ సతీష్ కుమార్

విశాలాంధ్ర-బొబ్బిలి : పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలో బాధ్యతగా ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని పట్టణ సీఐ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు.విశ్రాంత ప్రధానో ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్, గాంధీ స్మారక నిధి గౌరవ అధ్యక్షులు మింది గుంప స్వామి మాస్టారి 90 వ జన్మదినోత్సవ వేడుకలు సందర్భంగా పాత బొబ్బిలి బస్టాప్ పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు ఎం విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో దయగల గోడ వద్ద గుంప స్వామి మాస్టారు, పట్టణ సిఐ కే సతీష్ కుమార్ కానుగ ,, బాదం, వేప మొక్కలను నాటారు.. ఈ సందర్భంగా సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ 40 ఏళ్ల తను ఉపాధ్యాయ వృత్తిలో వేలాదిమంది శిష్యులను సామాజిక సేవకులుగా తీర్చిదిద్దిన ఘనత మాస్టారుదే అన్నారు. ఇప్పటికీ సామాజిక దృక్పథంతో గుంప స్వామి మాస్టారు దయగల గోడ, గాంధీ స్మారక నిధి, మనం బ్లడ్ డొనేషన్ క్లబ్ లాంటి సేవా దృక్పథ సంస్థలకు వ్యవస్థాపకులుగా ఉండడం హర్షనీయమన్నారు. 90 ఏళ్ల వయసులోనూ సమాజానికి మంచి పని చేయాలన్న తలంపు కలిగి ఉండడం, తమ కుటుంబ సభ్యులు, గ్రామ యువత ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయయమన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో గాంధీ స్మారకనిధి, బిఆనందోబ్రహ్మబి, యువ సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధులు యం.రామకృష్ణ, బిహెచ్. జగన్నాథం, పి.సురేష్ కుమార్, ఎం.శ్రీను, కి.అజయ్, ఎం. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జూలై 11న జనాభా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీ లు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి మాణిక్యంనాయుడు తెలిపారు. జూలై 11న జనాభా దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ , రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ , అమరావతి ఆదేశాల ప్రకారం జిల్లాలో గల జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు జూలై 7న పోటీలు మండల స్థాయి లో నిర్వహించాలని ఉప విద్యాశాఖాధికారులకు, మండల విద్యాశాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఈ 9న న జిల్లా స్థాయి పోటీలకు నగర పాలక ఉన్నత పాఠశాల, కంటోన్మెంట్, విజయనగరం నకు ఉదయం 9 .30 గంటలకు పంపవలెనని తెలియజేసారు. పొగాకు, మత్తుపదార్థాల వినియోగం, నివారణ అంశం పై చిత్రలేఖనం పోటీలు, లింగ సమానత్వం మరియు గౌరవ మర్యాదలు అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. కావున మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులందరిని పోటీలో పాల్గొనేలా ప్రోత్సహించి పాఠశాల , మండల మరియు జిల్లా స్థాయిలలో జరిగే పోటీలు విజయవంతమయ్యేలా కృషి చేయాలనీ తెలియజేసారు.

జులై 9న టైర్ బంద్ పాటిద్దాం

రంగా డ్రైవర్లకు ఏఐఆర్ టిడబ్ల్యుఎఫ్ పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టే మోటార్ వాహన చట్టం 2021, భారత న్యాయ సంహిత చట్టం 106(1%c%2) లను రద్దు చేయాలని, 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు తోపాటు ప్రభుత్వమే యాప్ ను నడపాలని, లైసెన్సు, రెన్యువల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఆర్టీవో కార్యాలయాల ద్వారా జరగాలని, అమ్మతాపురం లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్లను రద్దు చేయాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, వాహన కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, వాహన మిత్ర 15000 తక్షణమే చెల్లించాలని, పెంచిన టోల్, గ్రీన్ ట్యాక్సు రద్దు చేయాలని, ఫీజులు, పెనాల్టీలు, చలానాలు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 21 ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ జులై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగం, ఓనర్లు డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో - కన్వీనర్ ఏ.జగన్మోహనరావు తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవన్ నందు యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రవాణా రంగంపై పెద్ద ఎత్తున దాడి చేస్తుందన్నారు. రాపిడో, ఉబర్, ఓలా వంటి సంస్థలను అనుమతించడంతో స్వయం ఉపాధిగా బ్రతుకుతున్న ఆటో, టాక్సీ ,మ్యాక్సీ క్యాబ్ ల రు బేరాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, సొంత వాహనాలను అమ్ముకోవడం (లేదా) ప్రైవేట్ సంస్థల యాజమాన్యలకు బందీలుగా మారిపోవడం జరుగుతుందన్నారు. వాటిని రద్దుచేసి కేరళ తరహాలో ప్రభుత్వం యాప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా కాకుండా సర్వీస్ రంగంగా గుర్తించి ప్రోత్సహించాలని, వారిపై వివిధ రూపాల్లో వేస్తున్న భారాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర రహదారుల్లో కూడా టోల్ గేట్లు ఏర్పాటు చేసి వాహనదారులపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. అందుకే రవాణా రంగ కార్మికులంతా జులై 9న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు టైర్ బంద్ పాటించాలని , జిల్లా కేంద్రంలో ఉదయం 9 గంటలకు కోట జంక్షన్ నుంచి జరిగే ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో లారీ, లగేజ్ గూడ్స్, ఆటో యూనియన్ అధ్యక్షులు టి. పైడ్రాజు, బి. సత్తిబాబు, బి .లక్ష్మణరావు నాయకులు కే గంగరాజు ఐ.ప్రసాదు, ఏ. అప్పలరాజు బి.శ్రీను , కె .శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.